క్లుప్తంగా

జిల్లా సాహితీ వేత్తకు బీఎన్ శాస్త్రి పురస్కారం



వైద్యం వేంకటేశ్వ రాచార్యులు

కర్నూలు కల్చరల్: వేద సంస్కృతి పరిషత్, మూసీ మాస పత్రిక సంయుక్తంగా ప్రదానం చేయనున్న బీఎన్ శాస్త్రి పురస్కారానికి జిల్లాకు చెందిన ప్రముఖ పరిశోధకులు, సాహితీ వేత్త వైద్యం వేంకటేశ్వరాచార్యులు ఎంపికయ్యారు. బీఎన్ శాస్త్రి 91వ జయంతిని పురస్కరించుకొని సాహితీ రంగం, పరిశోధన రంగంలో చేసిన సేవకు గుర్తింపుగా ఆయనకు ఈ పురస్కారం ప్రదానం చేయనున్నారు. ఈనెల 10వ తేదీ సాయంత్రం 5.30 గంటలకు హైదరాబాద్ ఉస్మానియా విశ్వవిద్యాలయం ఎన్‌సీసీ గేట్ సమీపంలోని సురభారతి హాల్‌లో విశ్రాంత ఐఏఎస్ ఎస్.ముక్తేశ్వరరావు, విశ్వవిద్యాలయం పూర్వ ప్రాచార్యులు డాక్టర్ శ్రీరంగాచార్య, చరిత్ర పరిశోధకులు డాక్టర్ డి.సూర్యకుమార్ పురస్కారాన్ని ప్రదానం చేయనున్నారు.

రేపు కార్తీక వనభోజనాలు

కర్నూలు(అర్బన్): పవిత్ర కార్తీక మాసాన్ని పురస్కరించుకొని ఈ నెల 10వ తేదీన పలు కుల సంఘాలు వనభోజన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆయా కుల సంఘాల నాయకులు శుక్రవారం వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. వడ్డెర సంఘం ఆధ్వర్యంలో బళ్లారి రోడ్ నాగేంద్రనగర్‌లోని వడ్డెర సంఘం కమిటీ హాల్‌లో వనభోజన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు లక్ష్మీ వెంకటేశ్వర వడ్డెర కుల సంఘం నాయకులు గోగుల అయ్యన్న తెలిపారు. అలాగే హిందు మాదిగల వనభోజన కార్యక్రమాన్ని స్థానిక వినాయక ఘాట్ ఎదురుగా ఉన్న సత్యనారాయణ స్వామి దేవాలయంలో నిర్వహిస్తున్నట్లు హిందూ మాదిగల కార్తీక వనభోజన కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు దేవరపోగు మద్దిలేటి తెలిపారు. కార్యక్రమంలో భాగంగా వివాహ పరిచయ వేదిక, రామాయణ, మహాభారతంలో క్విజ్ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలోనే జి. పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల వెనుక ఉన్న విజ్ఞాన పీఠంలో నగర బలిజ, తెలగ, కాపు కార్తీక వనభోజన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆహ్వాన కమిటీ సభ్యులు గాండ్ల లక్ష్మన్న, శోభన్, శైలేష్, సుజాత, శ్రీనివాసులు తెలిపారు.

బాలల అక్రమ రవాణపై దృష్టి

కర్నూలు(రాజ్‌విహార్): బాలల అక్రమ రవాణను అరికట్టడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కార్మిక శాఖ కర్నూలు సహాయ కమిషనర్ కేశన్న అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక ధర్మపేటలోని తన కార్యాలయంలో కింది స్థాయి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలల హక్కుల పరిరక్షణ కోసం ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, అందుకు అనుగుణంగా పని చేయాలని సూచించారు. ముఖ్యంగా రైల్వే స్టేషన్, బస్టాండ్లలో నిఘా పెట్టాలన్నారు.

కార్మికులకు ఆరోగ్య పరీక్షలు

కర్నూలు(సెంట్రల్): నగరంలోని చిత్తారి వీధిలో బీడీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి కేంద్ర ప్రభుత్వ వెల్ఫేర్ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ కిశోర్‌కుమార్ హాజరై కార్మికులకు పరీక్షలు నిర్వహించారు. అనంతరం సుమారు 100 మందికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఈశ్రమకార్డు, పీఎంఎస్‌వైఎం పథకాలపై బీడీ వర్కర్స్ యూనియన్ నాయకులు ఇక్బాల్ హుస్సేన్, అబ్దుల్‌దేశాయ్ వివరించారు.

మాజీ సైనికుడు మృతి

కర్నూలు(అర్బన్): నగరంలోని ఎన్‌సీసీ క్యాంటీన్ సమీపంలోని కాలనీలో నివసిస్తున్న మాజీ సైనికుడు సిగ్నల్స్ కోర్ప్స్‌కు చెందిన నాయక్ సుబేదార్ శాస్త్రి ఈ నెల 7వ తేదీన రాత్రి మృతి చెందారని జిల్లామాజీ సైనికుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు నర్రా పేరయ్య శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన మృతి పట్ల సంఘం ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తుందన్నారు.

పాత సాఫ్ట్‌వేర్‌నే కొనసాగించాలి

కర్నూలు(సెంట్రల్): భూములు, ఇతర ఆస్తుల రిజిస్ట్రేషన్ ప్రక్రియలో పాత సాఫ్ట్‌వేర్‌ను కొనసాగించాలని డాక్యుమెంట్ రైటర్లు శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ అంశంపై షాపులుమూసి వేసి జిల్లా రిజిస్ట్రార్, కర్నూలు, కల్లూరు సబ్ రిజిస్ట్రార్లకు వినతిపత్రం ఇచ్చినట్లు సీనియర్ డాక్యుమెంట్ రైటర్ చంద్రశేఖర్ తెలిపారు. కాగా, వీరి నిరసనకు కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.సుధాకరబాబు మద్దతు తెలిపారు.

పవిత్ర అక్షితల పంపిణీ



పవిత్ర అక్షితలను తీసుకెళ్తున్న వివిధ డివిజన్ల ప్రతినిధులు

కర్నూలు కల్చరల్: అయోధ్యలో భవ్య రామ భూమి నుంచి వచ్చిన పవిత్ర అక్షితలను శుక్రవారం శరీన్‌నగర్‌లోని సద్గురు త్యాగరాజ సీతారామాలయంలో జిల్లాలోని తొమ్మిది డివిజన్లకు పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు గోరంట్ల రమణ మాట్లాడుతూ అయోధ్యలో భవ్య రామ మందిరం నిర్మాణం సందర్భంగా భగవాన్ శ్రీరామ్ లల్లా విరాజ్‌మాన్ వేద మంత్రాలతో పూజించిన పవిత్ర అక్షితలను పంపిణీ చేస్తున్నామన్నారు. వీహెచ్‌పీ రాష్ట్ర కోశాధికారి సందడి మహేష్, జిల్లా కార్యదర్శి భానుప్రకాష్, వీహెచ్‌పీ, బజరంగ్ దల్, మాతృశక్తి నాయకులు నాగేశ్వరరావు, నటరాజ్, సాయిరామ్, రామకృష్ణ, నవీన్‌కుమార్, కృష్ణ పావని, నాగేంద్ర, మురళి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ జగన్‌తోనే సామాజిక న్యాయం



సమావేశానికి హాజరైన వైఎస్ఆర్‌సీపీ కార్పొరేటర్లు, నాయకులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్

- చేసిన మేలు చెప్పేందుకే సాధికార బస్సు యాత్ర
- వచ్చే వారంలో కర్నూలులో నిర్వహణ
- కార్పొరేటర్లు, ముఖ్య నాయకుల సమావేశంలో ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్

కర్నూలు(రాజ్‌విహార్): వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే సామాజిక న్యాయం సాధ్యమని, ఇప్పటికే ప్రతి వర్గానికి న్యాయం చేసిన ఘనత ఆయనకు దక్కిందని కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ అన్నారు. శుక్రవారం రాత్రి స్థానిక పాతబస్తీలోని తన కార్యాలయంలో కార్పొరేటర్లు, ముఖ్య నాయకులతో ఎమ్మెల్యే సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల కష్టాలు తెలిసిన నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అని అన్నారు. ప్రతిఒక్కరూ అభివృద్ధి చెందాలని ఆయన కోరుకుంటారన్నారు. ముఖ్యంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా గుర్తింపు తీసుకొచ్చారన్నారు. ఆయా వర్గాలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు 50 శాతం రిజర్వేషన్‌తో కూడిన చట్టం తీసుకురావడంతో పాటు అనేక చోట్ల ఓసీ స్థానాల్లో కూడా ఆయా వర్గాలకు టిక్కెట్లు ఇచ్చి ప్రోత్సహించారన్నారు. పలు సంక్షేమ పథకాల్లో బడుగు, బలహీన వర్గాలకు ప్రాధాన్యత ఇవ్వడంతో ఆర్థికంగా ఎదిగారని చెప్పారు. ఇలా వైఎస్ జగన్ సర్కారు చేసిన మేలును వివరించేందుకు వచ్చే వారం కర్నూలులో సాధికార బస్సు యాత్ర నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. ఈ బస్సు యాత్రను జయప్రదం చే యాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. త్వరలో కార్యక్రమం నిర్వహణ తేదీ, సమయం, వేదికను ప్రక టిస్తామని వెల్లడించారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత

నగర ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇస్తానని కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక పాతబస్తీలోని తన కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డుల్లోని సమస్యలతో పాటు వైద్య, ఆరోగ్యం, విద్యకు సంబంధించిన అర్జీలను వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు.

మహిళా సాధికారతకు కృషి



జెండా ఊపి ఆటోలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

- అర్హులు ఉన్నతి–మహిళా శక్తి పథకాన్ని సద్వినియోగం చేసుకోండి
- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి
- మహిళా శక్తి ఆటోలను ప్రారంభించిన ఎమ్మెల్యే

కల్లూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తున్నారని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. ఉన్నతి– మహిళాశక్తి పథకంలో భాగంగా పెద్దటేకూరు, బస్తిపాడు గ్రామాల పొదుపు మహిళలకు ఐదు ఆటోలు మంజూరయ్యాయి. వాటిని శుక్రవారం ఎమ్మెల్యే తన స్వగృహం దగ్గర జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) పొదుపు సంఘాల్లోని ఎస్సీ, ఎస్టీ మహిళల జీవనోపాధికి ఉన్నతి పథకం కింద వడ్డీలేని రుణాలు అందిస్తుందని చెప్పారు. తీసుకున్న రుణాన్ని కంతుల రూపంలో బ్యాంకుల్లో చెల్లించాలన్నారు. ఈ వడ్డీ లేని రుణాలకు ఎస్సీ, ఎస్టీ మహిళలు దరఖాస్తు చేసుకోవాలన్నారు. కులమతాలు, రాజకీయాలు చూడకుండా అర్హతే ప్రామాణికంగా వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం పథకాలను మంజూరు చేస్తోందన్నారు. ఈ అవకాశాన్ని పేద మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గత టీడీపీ పాలనలో పొదుపు సంఘాల మహిళలు ఆర్థికంగా ఇబ్బంది పడ్డారన్నారు. రుణమాఫీ పేరుతో నాడు చంద్రబాబు మోసం చేశారన్నారు. 2019లో అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సున్నా వడ్డీ, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత వంటి మొదలగు పథకాల ద్వారా మహిళా సాధికారతకు పెద్దపీట వేశారన్నారు. అంతకు ముందు ఎమ్మెల్యే, నాయకులు లబ్ధిదారుల ఆటో ఎక్కి వారిని ప్రోత్సహించారు. కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ కేవీ రమణారెడ్డి, ఎంపీటీసీలు మునిస్వామి, నాగేశ్వరావు, నాయకులు శ్రీధర్‌రెడ్డి, హనుమంతురెడ్డి, చంద్రారెడ్డి, ఏపీఎం శ్రీనివాసగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

యువతను ఓటర్లుగా నమోదు చేయించండి

కర్నూలు(సెంట్రల్) : 18ఏళ్లు నిండిన యువతీ, యువకులను ఓటర్లుగా చేర్పించేందుకు చర్యలు తీసుకోవాలని పాణ్యం నియోజకవర్గ ఎన్నికల అధికారి, జేసీ నారపురెడ్డి మౌర్య అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆమె తన చాంబరులో ఆ నియోజకవర్గానికి సంబంధించి రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. పాణ్యం నియోజకవర్గంలో వారం రోజుల పరిధిలో 9 వేల మందిని ఓటర్లుగా చేర్పించినట్లు చెప్పారు. ఇంకా ఓటరుగా నమోదు కాని యువకులను చేర్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకోసం స్వీప్ కార్యక్రమాన్ని కాలేజీల్లో చేపట్టాలని ఆదేశించారు. శుక్రవారం నాలుగు కాలేజీల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించి ఓటు నమోదుపై యువకులకు అవగాహన కల్పించినట్లు చెప్పారు. డిసెంబర్ 9వ తేదీ అర్ధరాత్రి వరకు ఓటరు నమోదుకు అవకాశం ఉందన్నారు. రాజకీయ పార్టీల అభ్యంతరాలను డిసెంబర్ 9వ తేదీలోపు నిర్దేశిత ఫారాల ద్వారాస్వీకరించి తగు పరిష్కారాలు చూపాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నుంచి యశ్వంత్‌రెడ్డి, సీపీఐ నుంచి శ్రీనివాసులు, వైఎస్ఆర్‌సీపీ నుంచి అక్కిమి అనుమంతరెడ్డి, బీజేపీ తరపున నవీన్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.



విద్యార్థులతో కలిసి పోస్టర్లను విడుదల చేస్తున్న జేసీ

అర్హులు ఓటు హక్కు నమోదు చేసుకోవాలి

కర్నూలు సిటీ: వచ్చే ఏడాది జనవరి 1వ తేది నాటికి 18 ఏళ్లు నిండే వారందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ నారపరెడ్డి మౌర్య తెలిపారు. శుక్రవారం నగరంలోని శంకరాస్ డిగ్రీ కాలేజీ, హజీరా డిగ్రీ కాలేజీల్లో జరిగిన ఓటరు నమోదు కార్యక్రమంపై ఆమె అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ పాల్గొని ప్రసంగించారు. కాలేజీల్లో చదువుతున్న విద్యార్థులు ఓటరుగా నమోదు చేసుకోవాలని, ఇప్పటికే ఓటరుగా నమోదు చేసుకున్న వారు జాబితాలో పేరు చెక్ చేసుకోవాలన్నారు. నేడు, రేపు ఆయా ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాల్లో బూత్ లెవెల్ ఆఫీసర్లు అందుబాటులో ఉంటారన్నారు. అనంతరం ఓటరు నమోదు వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కల్లూరు తహసీల్దారు రమేష్ పాల్గొన్నారు.

ఎంఎల్ఎస్ గోదాము ఇన్‌చార్జ్‌పై చర్యలు తీసుకోవాలి

కర్నూలు(సెంట్రల్): కలెక్టరేట్ వెనుక ఉన్న ఎంఎల్‌ఎస్ పాయింట్ గోదాము ఇన్‌చార్జ్ నస్రీన్ పేదలకు పంచాల్సిన బియ్యాన్ని పక్కదారి పట్టిస్తున్నారని, ఆమెపై చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వై.నగేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం జేసీ నారపురెడ్డి మౌర్యకు వారు వినతిపత్రం సమర్పించారు. ఇటీవల కర్నూలులోని షాపు నంబర్ 113కు వెళ్లాల్సిన బియ్యం లారీని పక్కదారి పట్టించినట్లు ఓ రేషన్ షాపు డీలర్ ఏకంగా సోషల్ మీడియాలో ఫొటోలు పెట్టారని నగేష్ పేర్కొన్నారు. అంతేకాక అంగన్‌వాడీలకు ఇచ్చే పౌష్టికాహార కిట్లు, కిచిడీలను కూడా ఆమె పక్కదారి పట్టిస్తున్నట్లు ఆరోపణలు ఉన్న నేపథ్యంలో విచారణ చేయాలని కోరుతున్నట్లు డిమాండ్ చేశారు.

గ్రామీణ ఆరోగ్య భారతాన్ని సాధించాలి

కర్నూలు(హాస్పిటల్): ప్రతి ఒక్కరూ గ్రామీణ ఆరోగ్య భారతాన్ని సాధించేందుకు కృషి చేయాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ వై. ప్రవీణ్ కుమార్ చెప్పారు. శుక్రవారం స్థానిక ఇ.తాండ్రపాడు పీహెచ్‌సీ పరిధిలోని ఉల్చాల గ్రామంలో గ్రామీణ ఆరోగ్య పారిశుధ్య పోషకాహార కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి రెండో శుక్రవారం అన్ని గ్రామ పంచాయతీ పరిధిలోని అన్ని వీహెచ్ఎస్ఎన్‌సీ కమిటీలలో సమావేశం నిర్వహించాలన్నారు. ఈ కమిటీలో సర్పంచ్, పంచాయతీ సెక్రటరీ, ఏఎన్ఎం, ఆశా, అంగన్‌వాడీ సిబ్బంది, స్కూల్ టీచర్, ఇంజినీర్, గర్భిణులు, బాలింతలు, స్వయం సహాయక సిబ్బంది, గ్రామ ప్రజలు, వైద్య ఆరోగ్య సిబ్బంది, సచివాలయం సిబ్బంది సభ్యులుగా ఉంటారన్నారు. వీరు ఆరోగ్య కార్యక్రమాలు, ప్రభుత్వ ప్రోత్సాహకాలు, ఆ నెలలో చేయాల్సిన కార్యక్రమాల గురించి చర్చిస్తారన్నారు. అలాగే ఆరోగ్య కార్యక్రమాల ప్రణాళిక వేసి అమలు పరచాలన్నారు. పోషకాహారం గురించి చర్చించి, గర్భిణులు, పిల్లలకు మంచి పోషకాహారం ఇవ్వాలన్నారు. ప్రభుత్వం ఒక్కో కమిటీకి సంవత్సరానికి రూ.10వేల చొప్పున బడ్జెట్ ఇస్తోందని, ఆ బడ్జెట్‌ను ఆ గ్రామాభివృద్ధికి ఉపయోగించాలని తెలిపారు. అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను సమావేశంలో తెలిపి ప్రతి నెలా సమావేశాలు ఏర్పాటు చేయా లని చెప్పారు. ఈ నెల 11 నుంచి 16వ తేది వరకు మిషన్ ఇంద్ర ధనస్సు కార్యక్రమంలో ఏదైనా కా రణం వల్ల సున్నా నుంచి ఐదేళ్లలోపు పిల్లలు, గర్భిణిలకు టీకాలు వేయకుంటే ఈ కార్యక్రమంలో వేయించాలన్నారు. సమావేశంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ విజయమాధురి, డీసీఎం ప్రసాద్, ఎంపీహెచ్ఈఓ మక్బూల్, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ కృష్ణమోహన్, పంచాయతీ సెక్రటరీ అబ్దుల్ అజీజ్, ఐసీడీఎస్ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఐఓ డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్

కార్మిక, కర్షక ఐక్యతను చాటుదాం

- ఏఐకేఎస్ జాతీయ కౌన్సిల్ సమావేశాల పోస్టర్,స్టిక్కర్ ఆవిష్కరణలో నాయకులు

కర్నూలు(సెంట్రల్): డిసెంబర్ 15,16,17 తేదీల్లో జరిగే ఏఐకేఎస్ జాతీయ కౌన్సిల్ సమావేశాల్లో కార్మిక, కర్షక ఐక్యతను చాటుదామని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకరరెడ్డి పిలుపునిచ్చారు. సమావేశాలకు సంబంధించిన పోస్టర్, స్టిక్కర్లను శుక్రవారం కార్మిక, కర్షక భవన్‌లో ఆహ్వాన సంఘం ఆవిష్కరించింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడతూ..15వ తేదీన సుందరయ్య సర్కిల్ నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ ఉంటుందని, అక్కడే బహిరంగ సభ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ ర్యాలీ, బహిరంగ సభకు అధిక సంఖ్యలో రైతులు, రైతు కూలీలు, కార్మికులు హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు జి.రామకృష్ణ, వై.నగేష్, రాధాకృష్ణ, ప్రభాకర్, మైమూద్, హుస్సేన్‌వలి తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఏఐకేఎస్ ఆహ్వాన సంఘం నాయకులు

దోమల నివారణకు చర్యలు

కల్లూరు: గ్రామాల్లో దోమల వ్యాప్తిని అరికట్టేందుకు చర్యలు చేపట్టినట్లు జిల్లా మలేరియా అధికారి నూకరాజు అన్నారు. శుక్రవారం కల్లూరు మండలం చిన్నటేకూరులో డ్రైడే ఫ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమాన్ని ఆయన పరిశీలించి పరిశుభ్రత యొక్క ప్రాధాన్యతను ప్రజలకు వివరించారు. డ్రమ్ములను, నీటి తొట్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని సూచించారు. గచ్చులలో దోమ లార్వాలు అభివృద్ధి చెందకుండా వారానికి ఒక రోజు అందులోని నీటిని పారవేయాలన్నారు. నివాస పరిసరాలు పరిశుభ్రంగా ఉండే వ్యాధులు దరిచేరవన్నారు. ఈ విషయాలపై ఏఎన్ఎమ్, ఆశా కార్యకర్తలు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల కళాశాలలో దోమలతో వచ్చే వ్యాధుల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారం గురించి తెలియజేసి గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలకు నాణ్యమైన సమతుల ఆహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉలిందకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ఎంపీహెచ్ఓ విజయ్ కుమార్, సూపర్ వైజర్ నాగరాజు, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



డ్రమ్ములో నిల్వ నీటిని పరిశీలిస్తున్న జిల్లా మలేరియా అధికారి నూకరాజు

ఈ రోజు

నగరంలో విద్యుత్ కోతలు

కర్నూలు(రాజ్‌విహార్): నగరంలో శనివారం విద్యుత్ కోతలు విధించనున్నట్లు దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు టౌన్, రూరల్స్ డిప్యూటీ ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు రాజేంద్రబాబు, వై. సుబ్బన్న శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కర్నూలు–1, 2, రూరల్స్ సబ్ డివిజన్ల పరిధిలోని 33 సబ్‌స్టేషన్లు, పవర్ హౌస్, పోలీస్ క్వార్టర్స్, ప్రభుత్వ ఆసుపత్రి, ఎస్ఏపీ క్యాంప్, రేడియో స్టేషన్, మామిదాలపాడు, సంతోష్‌నగర్, జోహరాపురం, శరీన్ నగర్, ఇండస్ట్రీయల్ ఎస్టేట్, జి. పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల, వార్త ఏరియా, సబ్‌స్టేషన్లు, 33, 11 కేవీ ఫీడర్లు ఈ పనులు జరుగనున్నాయని పేర్కొన్నారు. రూరల్స్ సబ్ డివిజన్‌లోని కల్లూరు, ఓర్వకల్లు, కర్నూలు మండలాల్లోని పనులు నిర్వహించనున్నామని, ఈ సబ్‌స్టేషన్ల ద్వారా సరఫరా అందించే కాలనీలు, గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు వెల్లడించారు. ప్రతి నెల రెండవ శనివారం చేపట్టే నిర్వహణ పనుల్లో భాగంగా ఈ కోతలు విధిస్తున్నామని, ఈ అసౌకర్యానికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఉచిత వైద్యశిబిరం

కర్నూలు(హాస్పిటల్): ఆస్తమా, ఊపిరితిత్తుల సమస్యలతో బాధపడుతున్న వారికి ఈ నెల 10వ తేదీన ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు శివసాయి పాలిక్లినిక్ నిర్వాహకులు రామకృష్ణారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి ఒంటి గంట వరకు నిర్వహించే శిబిరంలో స్పైరోమెట్రీ పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తారన్నారు. ఆస్తమా, దగ్గు, అలర్జీ, తుమ్ములు రావడం, ఛాతిలో నొప్పి, దగ్గులో రక్తం పడటం, బ్రాంకైటిస్, ఊపిరితిత్తుల్లో నీరు చేరడం, డస్ట్ అలర్జీ, క్షయ వ్యాధి, ఊపిరితిత్తుల క్యాన్సర్, న్యూమోనియా, పొగతాగడం వల్ల వచ్చే దుష్ఫలితాలు, పోస్టు కోవిడ్ లక్షణాలకు పల్మనాలజిస్టు డాక్టర్ సువర్ణలక్ష్మి చికిత్స అందిస్తారన్నారు.

ధ్యాన యోగ శిక్షణ

కర్నూలు కల్చరల్: భగవాన్ ధన్వంతరి యోగాశ్రమం ఆధ్వర్యంలో శనివారం ఉదయం 7.0 గంటలకు కొత్త బస్టాండ్ సమీపంలోని చల్లా వీధిలో ధ్యాన యోగ శిక్షణ ఇస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మూడో విడతలో ఇచ్చే శిక్షణలో గురువు పద్మానంద యోగి సందేశం, యోగాలోని మెళకువలు, ఆరోగ్య చిట్కాలు చెబుతారని పేర్కొన్నారు.

అవీ- ఇవీ

సమస్యలపై వెంటనే స్పందించాలి

కర్నూలు(రాజ్‌విహార్): వినియోగదారుల నుంచి వచ్చే ఫిర్యాదులపై వెంటనే స్పందించాలని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు రూరల్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు వై. సుబ్బన్న ఆదేశించారు. శుక్రవారం పవర్ హౌస్‌లోని తన కార్యాలయంలో కింది స్థాయి సిబ్బందితో సమావేశం నిర్వహించి మాట్లాడారు.

బడి ఈడు పిల్లలతో పని చేయిస్తే కఠిన చర్యలు

కర్నూలు(రాజ్‌విహార్): బడి ఈడు పిల్లలతో పనులు చేయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ డీసీపీఓ శారద హెచ్చరించారు. శుక్రవారం కార్మిక శాఖ అధికారులతో కలిసి నగరంలోని ప్రధాన కూడళ్లలో ఉన్న షాపులను తనిఖీ చేశారు. అనంతరం కార్మిక శాఖ డీసీఎల్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎక్కడైనా చిన్న పిల్లలతో పనులు చేయిస్తే ఛైల్డ్ లైన్–1098 నంబరుకు ఫిర్యాదు చేయాలని కోరారు.

అర్బన్ హెల్త్ సెంటర్లలో పోస్టుల భర్తీకి భారీ స్పందన

కర్నూలు(హాస్పిటల్): జిల్లాలో ని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లలో పోస్టుల భర్తీకి శుక్రవారం నిర్వహించిన వాక్ ఇన్ ఇంటర్వ్యూకు భారీ స్పందన లభించింది. కాంట్రాక్టు పద్ధతిన భర్తీ చేసే ఈ పోస్టులకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. 6 స్టాఫ్ నర్సు పోస్టులకు 58 దరఖాస్తులు, 4 ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులకు 97 దరఖాస్తులు, ఒక ఫార్మాసిస్టు పోస్టుకు 57 దరఖాస్తులు, ఒక క్లినికల్ సైకాలజిస్ట్ పోస్టుకు 5 దరఖాస్తులొచ్చాయి.

13న జేజేఎం పనులపై వర్క్‌షాప్

కర్నూలు(అర్బన్): జల జీవన్ మిషన్ కార్యక్రమాలకు సంబంధించి ఈ నెల 13న స్థానిక జెడ్పీ సమావేశ భవనంలో వర్క్‌షాప్ జరగనుందని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ బీ నాగేశ్వరరావు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ వర్క్‌షాప్‌నకు చీఫ్ ఇంజినీరు గాయత్రీ హాజరవుతున్నారన్నారు. కర్నూలు, నంద్యాల, అనంతపురం, సత్యసాయి జిల్లాలకు చెందిన ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ, ఈఈ, డీఈఈ, ఏఈలకు జేజేఎం పనులపై దిశా నిర్దేశం చేయనున్నారన్నారు.

ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంపై అవగాహన

కర్నూలు సిటీ: మదర్ థెరిస్సా ఫార్మసీ కాలేజీలో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంపై శుక్రవారం అవగాహన కల్పించారు. కాలేజీ అకడమిక్ డైరెక్టర్ డా.ఆదిమూలపు సతీష్ మాట్లాడుతూ పోటీల్లో పాల్గొనే వారు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ డా.రవికుమార్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డా.సురేష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్షేమ ప్రభుత్వానికి అండగా ఉందాం

కల్లూరు : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పాలనకు అండగా నిలుద్దామని వైఎస్ఆర్‌సీపీ నాయకులు అన్నారు. కల్లూరు అర్బన్ 26వ వార్డులో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమం నిర్వహించారు. కల్లూరు కన్వీనర్ ఇన్‌చార్జి గోవర్ధన్ రెడ్డి, అర్బన్ క్లస్టర్ –1 అధ్యక్షులు భీమశంకర్‌రెడ్డి, కార్పొరేటర్ లక్ష్మీకాంతరెడ్డి పాల్గొన్నారు.

సీపీఐ నాయకుడి మృతిపై సంతాపం

కర్నూలు(సెంట్రల్): ఆత్మకూరు నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి శ్రీనివాసులు అనారోగ్యంతో మృతి చెందడంపై ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య శుక్రవారం ఓ ప్రకటనలో సంతాపం తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

స్పోర్ట్స్

విజేతలుగా తిరిగి రండి

కర్నూలు (టౌన్) : ఈనెల 9 నుంచి 11 వ తేదీ వరకు గుంటూరు జిల్లాలోని నాగార్జున యూనివర్సిటీలో 4 వ రాష్ట్ర స్థాయి యోగాసన పోటీల్లో పతకాలు సాధించాలని టీడీపీ నగర ఇన్‌చార్జీ టీజీ భరత్ ఆకాంక్షించారు. శుక్రవారం స్థానిక మౌర్య ఇన్‌లో ఆయన యోగా క్రీడాకారులను అభినందించారు. కార్యక్రమంలో జిల్లా యోగాసన కార్యదర్శి ప్రభాకర్, ఉపాధ్యక్షుడు ఉపేంద్రగౌడ్ పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

కర్నూలు (న్యూటౌన్): క్రీడలు విద్యార్థుల్లో మానసిక ఉల్లాసం పెంచుతాయని ఉపాధ్యాయుడు వెంకటకృష్ణుడు అన్నారు. శుక్రవారం నగర శివారులోని ఆదర్శ కాలేజీలో 50 మంది ఫుట్‌బాల్ క్రీడాకారులకు ఉచితంగా ఫుట్‌బాల్స్, షూస్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉపాధ్యాయుడు వెంకటకృష్ణుడు, సుధాకర్, కౌన్సిలర్ శేషన్న, ఎన్జీఓ ప్రతినిధి నజీర్ అహ్మద్ హాజరయ్యారు. వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులు క్రీడల్లో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. కార్యక్రమంలో పీస్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షుడు దరగయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రీడా స్ఫూర్తితో రాణించాలి



రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటున్న జట్టుకు క్రీడా దుస్తులు పంపిణీ చేసిన కార్పొరేటర్ లక్ష్మీకాంతరెడ్డి

కర్నూలు (టౌన్) : ఈనెల 8 నుంచి 10 వ తేదీ వరకు బాపట్ల జిల్లా మద్దూరులో నిర్వహించనున్న 42 వ జూనియర్ రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించి పతకాలు సాధించాలని 26 వ వార్డు కార్పొరేటర్ లక్ష్మీకాంత రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో రాష్ట్ర పోటీల్లో పాల్గొంటున్న జిల్లా క్రీడాకారులకు ఆయన టీషర్టులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా షూటింగ్ బాల్ సంఘం కార్యదర్శి ఈశ్వర్‌నాయుడు పాల్గొన్నారు.

రేపు వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ ఆత్మీయ సమావేశం

కర్నూలు (లీగల్) : వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ ఆత్మీయ సమావేశం ఆదివారం స్థానిక మున్సిఫ్ కోర్టు సమీపంలోని ఛాంబర్ ఆఫ్ కామర్స్ హాల్‌లో నిర్వహిస్తున్నట్లు జోనల్ ఇన్‌చార్జ్ ఎం.ప్రభాకర్, జిల్లా అధ్యక్షుడు సువర్ణారెడ్డి తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.మనోహర్ రెడ్డి, రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం, ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్, ఎమ్మెల్సీలు రామసుబ్బారెడ్డి, డాక్టర్ మధుసూదన్, పార్టీ జిల్లా అధ్యక్షుడు, నగర మేయర్ బీవై రామయ్య, జెడ్పీ ఛైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, ఎమ్మెల్యేలు హాజరవుతారని తెలిపారు.

రేపు గ్రూప్-1,2 పరీక్షలపై అవగాహన

కర్నూలు సిటీ: కర్నూలు అచీవర్స్ అకాడమీ ఆధ్వర్యంలో గ్రూప్–1, గ్రూప్–2 పరీక్షలపై రేపు (ఆదివారం)ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఉచిత అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆ అకాడమీ డైరెక్టర్ సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న గ్రూప్–1, గ్రూప్–2 ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చిందన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు 81436 44622, 81436 55622 నంబర్లను సంప్రదించాలన్నారు.